12

# దుష్టులకు శిక్ష

*"నీ కాఠిన్యమును, మార్పు పొందని నీ హృదయమును అనుసరించి, ఉగ్రత దినమందు; అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలు పరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు. ఆయన ప్రతివానికి వానివాని క్రియలచొప్పున ప్రతిఫలమిచ్చును. సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును. అయితే భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును. దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు ... శ్రమయు వేదనయు కలుగును"* (రోమా 2:5–9).

మనం జీవితంలో ఆనందం ఎప్పుడూ కొనసాగాలని ఒకవైపు కోరుకుంటూ, బాధలు తక్షణం అంతరించాలని అనుకుంటాం. శిక్ష ఆనందకరంగానూ, సంతోషదాయకంగానూ ఉండదు, తప్పు చేసినప్పుడు మనకు సమ్మతం లేకపోయినా శిక్ష అనుభవించవలసి వస్తుంది. దేవుడు చేయవలసినదంతా తప్పక చేసి తీరుతాడు, దానికి మనం ఎదురు చూడవలసిందే. లేకుంటే తప్పు చేసినవానిని దేవుడు ఇంకెలా శిక్షిస్తాడు?

## శిక్ష దేన్నిపోలి యుంటుంది?

మనం యింతకుముందే తీర్మానించినట్టు, కాలాంతమున దుష్టులకు శిక్ష నిరంతర మైనదని బైబిలు బోధిస్తుంది. "నిత్య శిక్ష" ఎలా ఉంటుందో మనం ఊహించలేం (మత్తయి 25:46).

**రూపుమాపబడడమా?**

నిరంతరంగా ఎవ్వరూ శిక్షను పొందరని కొందరు ఉపదేశిస్తారు. "నిత్య శిక్ష" అంటే, అవిధేయులు సర్వనాశనం చేయబడతారు, అంటే రూపుమాపబడతారు అనేది వారి నమ్మిక. ఉనికిలో లేకుండ పోవడమనేది నిత్య శిక్ష అని వారు నమ్ముతారు. ఈ సిద్ధాంతాన్ని వారు దుష్టులు నిత్యనాశనాన్ని పొందుతారు లేక నశింపచేయబడతారనే వచనాన్ని ఆధారంగా చేస్తారు (మత్తయి 10:28).

*Apollumi* అనే గ్రీకు పదం, "నశింపజేయబడుట" అని మత్తయి 10:28లో తర్జుమా చేయబడింది. అదే "నశించిపోవు" (మత్తయి 8:25) మరియు "పోగొట్టు కొను" (లూకా 15:4, 6) అని తర్జుమా చేయబడింది. మత్తయి 9:17లో ద్రాక్షారసపు తిత్తులను

ప్రభువు ఉదహరించినప్పుడు, అవి పాడగును అని ఆయన తెలిపారు, కాని ఉనికిలేకుండ పోతాయని ఆయన చెప్పలేదు. గొర్రె, నాణ్యము, కుమారుడు తప్పిపోయి *(apollumi)* మరల దొరికాయి (లూకా 15:6, 9, 24). "నశించినదానిని వెదకి రక్షించుటకు" ప్రభువు వచ్చారు (లూకా 19:10). "నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును" అని ఆయన వాగ్దానం చేశారు (మత్తయి 10:39). రూపుమాపబడేది కనుగొనబడడానికో రక్షింపబడడానికో కుదిరేది కాదు. ప్రతి సందర్భంలోను, *apollumi* అనే పదం "పోగొట్టుకొను." "చెడిపోవు," "నశించు," లేక నాశనం చేయబడు" అనే భావమే యిస్తుంది గాని "రూపుమాపబడు" అనే భావం యివ్వదు.

దుష్టులు నిత్యత్వమంతటిలో శిక్షింపబడుతునే ఉంటారు: "వారి బాధ సంబంధమైన పొగ యుగయుగములు లేచును ... రాత్రింబగళ్లు నెమ్మదిలేనివారైయుందురు" (ప్రకటన 14:11). ముందు అగ్నిగుండములో పడవేయబడిన అపవాదియు, క్రూర మృగమును, అబద్ధ ప్రవక్త యొక్క శిక్షను గూర్చి ప్రకటన 20:10లో అదే రకమైన వర్ణన యివ్వబడింది – ప్రకటన 19:20 దానిలో పడినవారిని అగ్ని గుండము రూపుమాపినట్టయితే, అపవాది దానిలో పడవేయబడక మునుపే అందులో పడవేయబడిన క్రూరమృగమును అబద్ధ ప్రవక్తయు కాలిపోయి ఉండేవారే (ప్రకటన 20:2, 3). వారు యింకను అగ్ని గుండములోనే ఉండి "యుగయుగములు రాత్రింబగళ్లు" బాధింపబడుతునే ఉన్నారు (ప్రకటన 20:10).

క్రొత్త నిబంధన క్రింద దేవుని కృపను నిరాకరించినవారు, మోషే ధర్మశాస్త్రమును నిరాకరించినవారికంటె అధికమైన శిక్షకు పాత్రులుగా ఎంచబడుతున్నారు (హెబ్రీ. 10:29). మోషే ధర్మశాస్త్రాన్ని నిరాకరించినవారికి అనుగ్రహించిన హీనమైన శిక్ష మరణమైనందున, మరణంకంటెను భయపడవలసిన శిక్ష వీరికి ఉండాలి. ఆ శిక్ష నరకము.

## వాస్తవమైన శిక్ష

*Gehenna*[1] గ్రీకు–యాకోబు 3:6 అనే యింకొక్క రిఫెరెన్స్ తప్ప నరకము అనేది నిజమైన స్థలంగా ప్రత్యేకించి ప్రభువైన యేసుచే ప్రస్తావించబడింది.[2] *Hades, gehenna* అనేవాటిని "hell" అని తర్జుమా చేయడంలో KJV తికమకపడింది. *Hades* అంటే మృతులకొరకు ఏర్పాటు చేయబడిన మధ్యస్థపు స్థితి; hell అంటే, దుష్టులను శిక్షించు స్థలము అనే తేటైన వ్యత్యాసాన్ని గుర్తించాలి.

ఐనోను కుమారులకు చెందిన, యెరూషలేము దక్షిణ భాగములోని కొండకనుము ప్రాంతమును గెహెనా అనేవారు ఆ స్థలము దేవునికి, మానవునికి హేయమైన, అసహ్యకరమైన స్థలమై ఉంది. ఎందుకనగా, అచ్చట విగ్రహారాధికులు తమ పిల్లలను దహించేవారు.[3] కావున, యేసు కాలములో, అది యెరూషలేము చెత్తకుండిగా మారింది. అది పురుగులతో నింపబడి నిత్య అగ్నిచేత కాలుతూ ఉండింది. ప్రభువువారు దుష్టుల శిక్షణను వివరించటానికి వాడకలోని "గెహెనా" అను పదమును ఉపయోగించారు.

గెహెనా అగ్నిని ప్రభువు అగ్ని గుండమని పోల్చారు (మత్తయి 13:42, 50). ఇది

నిత్యాగ్ని ఆరని అగ్ని (మత్తయి 3:12; 18:8; 25:41; మార్కు 9:48[4]). "పురుగు" చావదని కూడ ఆయన తెలిపారు. అగ్నియు పురుగులును కళేబరములను దహించివేసినట్టయితే, అగ్ని ఆరిపోయేదే, తినడానికి ఏమిలేని పురుగు చచ్చియుండేదే. అగ్నియు, పురుగులును ప్రభువు అక్షరార్థంగా ఉద్దేశింపకపోయినా, శిక్ష అనంతమైనదని సూచించే పదాలను ఆయన ఉపయోగించారు.

అగ్ని అక్షరార్థమైనది కాకపోయినట్లయితే, "అగ్ని" అనే పదాన్ని ప్రభువు మాటిమాటికి ఎందుకు ఉపయోగించి ఉంటారు? అలా కాకుంటే, ఆత్మల యొక్క శిక్షను మనకు అర్థమయ్యేలా మరి ఏలాగు ఆయన వర్ణించి యుంటారు? దాని సౌందర్యాన్ని మనకు తెలుపడానికి లేక గ్రాహ్యం చేయడానికి పరలోకాన్ని కూడా భౌతికమైన పదాలతో ఆయన వర్ణించియుంటారేమో. నరకము యొక్క భయంకరత్వం మనకు **అర్థమయ్యేటట్లు** ప్రభువు లౌకికమైన పదాలను ఉపయోగించియుండవచ్చు.

నరకంలో ఎలాటి శిక్ష అనుభవించవలసియుంటుంది? అవిధేయులు ఎదురు చూడ గలిగిందేమి?

(1) నరకానికి పంపబడేవారు తొలిగి "పొండని" చెప్పబడతారు (మత్తయి 7:23; 25:41; లూకా 13:27లను చూడు). వారు దేవునినుండి వేరుచేయబడతారు.

(2) వారు దేవుని సముఖమునుండి తొలగింపబడి శిక్షింపబడతారు (2 థెస్స. 1:9). దేవుడు వారిని చూడడు, వినడు, సహాయము చేయడని అది సూచింపవచ్చు.

(3) అపవాదియు, వాని దూతలును, భూమిమీద జీవించిన ప్రతి దుష్టుడును నరకంలో ఉంటారు (మత్తయి 25:41).

(4) నరకము అగ్నిగంధకములతో వేదించు స్థలమైయుంది (ప్రకటన 14:10; 20:10; 21:8 చూడు).

(5) నరకంలో నశింపజేయబడుతునే ఉంటారు (2 థెస్స. 1:9).

(6) వారు దేవుని రాజ్యములో ప్రవేశించుటకు అనుమతింపబడరు (1 కొరింథీ. 6:9; గలతీ. 5:21).

(7) వారు దేవుని ఉగ్రతను అనుభవిస్తారు (మత్తయి 3:7; రోమా 2:5; 5:9; ఎఫెసీ. 5:6; కొలస్సీ. 3:6). అది ఏమియు కలపబడకుండ పోయబడును (ప్రకటన 14:10).

(8) వారు వెలుపట చీకటిలో త్రోయబడుదురు (మత్తయి 8:12; 22:13; 25:30; 2 పేతురు 2:17; యూదా 13).

(9) వారికి శిక్షవిధింపబడును (మార్కు 16:16; యోహాను 5:29; 2 థెస్స. 2:12; 2 పేతురు 2:3; KJV).

(10) వారు క్షయ స్థితిలో ఉంటారు (గలతీ. 6:8).

(11) దేవుని ప్రతీకారాన్ని అనుభవిస్తారు (రోమా 12:19).

శిక్షింపబడేవారి ప్రతిచర్య వర్ణనాతీతము: శ్రమయు వేదనయు అనుభవిస్తారు (రోమా 2:9). అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయు ఉండునని ప్రభువు అన్నారు. అంటే, అది కఠోరమైన వేదనను వర్ణిస్తుంది (మత్తయి 8:12; 13:42, 50; 22:13; 24:51; 25:30; లూకా 13:28).

నరకాన్ని గూర్చి చెప్పబడిందంతా పరమ భయంకరమైనది; దాన్ని గూర్చి మంచిది ఏదీచెప్పబడలేదు. అక్కడికి వెళ్లేవారందరు అపవాదితోను దుర్మార్గులతోను సహవాసం కలిగియుంటారు (మత్తయి 25:41)! వారు దేవునితోగాని లేక నీతిమంతులతోగాని ఎన్నడూ ఉండరు. వారు నిరంతరం చికటిలో నివసింతురు. వెలుగైయున్న దేవుడు అక్కడ హాజరుగా ఉండడు. సూర్యుడు, నక్షత్రరాసులు, నక్షత్రాలు ఉండవు. దేవుడు మరియు ఈ వెలుగులు లేకుండ, అక్కడ కేవలం చీకటి మాత్రమే ఉంటుంది.

## శిక్షలో దశలుంటాయా?

దేవుని శిక్ష తీక్షణమైనదైయున్నందున, "శిక్షలో దశలుంటాయా?" అని మనం అడుగవచ్చు. "మంచివాడుగా జీవించి," సువార్తను నిరాకరించిన వ్యక్తిని, దుష్టుడై హత్య చేసినవానికి సమానంగా దేవుడు శిక్షిస్తాడా? న్యాయవంతుడైన దేవుడు ఈ పని చేస్తాడా? మానవ తార్కిక జ్ఞానము "లేదు!" అని మూల్గులిడవచ్చు, కాని దేవుడు ఎలా చేస్తాడో అనేదాన్ని యిది నిరూపించదు.

శిక్షలో అంతస్తులుంటాయని కొన్ని లేఖనాలు సూచిస్తాయి. మృగమునకు నమస్కరించినవారిని గూర్చి మాట్లాడుతూ, "ఏమియు కలపకుండ దేవుని ఉగ్రత పాత్రలో పోయబడిన దేవుని కోపమును మద్యమును వాడు త్రాగును" (ప్రకటన 14:10) అనేది – దేవుని ఉగ్రతలోని పూర్తి శక్తిని కొందరు త్రాగరని సూచిస్తుంది. మృగమునకు నమస్కరించినవారు మాత్రమే దేవుని ఉగ్రతలోని పూర్తి శక్తిని పొందుదురు.

వేషధారులైన యూదా మత నాయకులను గూర్చి మాట్లాడుతూ, "... విధవరాండ్ర యిండ్లు దిగమ్రింగుచు, కపటముగా దీర్ఘ ప్రార్థనలు చేయుదురు. వీరు మరి విశేషముగా శిక్షపొందుదురు" అని ప్రభువైన యేసు అన్నారు (మార్కు 12:40; మత్తయి 23:14; లూకా 20:47లను కూడా చూడు). "మరి విశేషముగా శిక్ష పొందడమంటే," ఎక్కువైన శిక్ష కాక మరి యింకేమి?

లూకా 12లోని ఉపమానంలో, ఒక దాసుడు తోటి దాసులను దాసీలను కొట్టి తిని త్రాగుచునుండువాని గూర్చి ప్రభువు తెలిపారు. అపనమ్మకస్థులతో అతనికి పాలు నియమింపబడునని చెప్పి, ఆయన యిలా కొనసాగించారు:

> తన యజమానుని చిత్తమెరిగియుండియు సిద్ధపడక, అతని చిత్తముచొప్పున జరిగింపక ఉండు దాసునికి అనేకమైన దెబ్బలు తగులును. అయితే తెలియక దెబ్బలకు తగిన పనులు చేసినవానికి కొద్ది దెబ్బలే తగులును. ఎవనికి ఎక్కువగా ఇయ్యబడెనో వానియొద్ద ఎక్కువగా తీయజూతురు; మనుష్యులు ఎవనికి ఎక్కువగా అప్పగింతురో వానియొద్ద ఎక్కువగా అడుగుదురు (47, 48 వచ.).

ఈ లేఖన భాగాలలో, శిక్షలోని అంతస్తులను ప్రభువు బోధించారు. ఈ బోధ నరకంలోని నిత్య శిక్షకు వర్తింపజేయబడుతుందా? అలాగైతే, శిక్షలో అంతస్తులున్నట్టే.

## నరకానికి వెళ్లేదెవరు?

ఎవరు శిక్షింపబడతారో మనకు చెప్పబడింది. కాఠిన్యము, మార్పు పొందని హృదయముగలవారిని వర్ణించుతూ, "భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడుచు," దుష్కార్యము చేయువారు శిక్షంపబడతారని పౌలు సూచించాడు (రోమా 2:5, 8, 9). ఇందులో, "దేవుని ఎరుగనివారు. ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారు" కూడా చేర్చబడ్డారు (2 థెస్స. 1:8). పరలోకానికి పోని జనులెవరో పౌలు సూచించాడు, అంటే, వారు నరకానికి వెళ్లతారనేగా (1 కొరింథీ. 6:9; గలతీ. 5:21; ఎఫెసీ. 5:5). వారు జీవించిన జీవితాలను బట్టి, నరకము వారి నిత్య నివాసమైయుంటుంది.

క్రొత్త నిబంధన, భయాన్ని గూర్చి మాట్లాడుతున్నందుకు ఆశ్చర్యపడనక్కర లేదు. "కావున మేము ప్రభువు విషయమైన భయము నెరిగి మనుష్యులను ప్రేరేపించు చున్నాము" అని పౌలు రాశాడు (2 కొరింథీ. 5:11). అదే ధోరణిలో పేతురు యిలా రాశాడు: "పక్షపాతము లేకుండ తీర్పుతీర్చువాడు తండ్రి అని మీరాయనకు ప్రార్థన చేయుచున్నారు గనుక మీరు పరదేశులైయున్నంత కాలము భయముతో గడుపుడి" (1 పేతురు 1:17). "ఆత్మను చంపనేరక దేహమునే చంపువానికి భయపడకుడి గాని ఆత్మను దేహమును కూడ నరకములో నశింపచేయగలవానికి మిక్కిలి భయపడుడని" క్రీస్తు ప్రభువు తెలిపారు (మత్తయి 10:28). "కాగా నా ప్రియులారా, మీరెల్లప్పుడు విధేయులైయున్న ప్రకారము, నా యెదుట ఉన్నప్పుడు మాత్రమే గాక మరి యెక్కువగా నేను మీతో లేని యీ కాలమందును, భయముతోను వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి" అని కూడా పౌలు అన్నాడు (ఫిలిప్పీ. 2:12).

"పరిపూర్ణ[5] ప్రేమ భయమును వెళ్లగొట్టును" (1 యోహాను 4:18), మరియు పరిపూర్ణ ప్రేమ మనలను విధేయులనుగా నిలుపును (యోహాను 14:15, 21; 1 యోహాను 5:3). దేవుని యెడల మనము ప్రేమను, భయాన్ని పెంచుకోవాలి. దేవుని పట్ల మనకున్న ప్రేమ ఆయనను సేవించునట్లు మనలను దగ్గరకు చేర్చును. మరియు దేవునియందలి భయము ఆయన చిత్తాన్ని జరిగించడానికి చాలినంత గౌరవాన్ని మనలో పెంచును (1 పేతురు 1:17).

## ముగింపు

మనం నరకానికి వెళ్ల గోరకుండునట్లు మనలను ఒప్పించడానికి చెప్పబడినదంతా సరిపోతుంది. నరకం మనకొరకు కాదు, అపవాదికి వాని దూతలకు రూపించబడింది. లోక చరిత్ర అంతటిలో వాడు కలిగించిన తొందరను బట్టి, దేవుడు చిత్రింపగలిగి తీక్షణమైన నరకంలో అపవాది యుగయుగాలు బాధింపబడడానికి పాత్రుడు. అది మనం అన్నట్టయితే, దేవునికి లోబడక, అపవాదిని వెంబడించినవారు వారి పాపములకు తేలికైన గద్దింపుకంటె ఎక్కువైన దానికి పాత్రులైయుంటారు.

నరక శిక్షను తప్పించుకుని పరలోకం చేరుకోవాలనేది మనం సాధించదలచిన పరమ గమ్యంగా ఉండాలి, పరలోకంలో అతి చిన్న స్థలమైనా, దానిని నరకంలోని

శాశ్వతమైన ప్రధాన స్థలం కంటె మిన్నగా గ్రహించాలి. మనం దేవుడు కోరినట్లు జీవిస్తూ, ఇతరులకు సహాయపడుతూ, వారు పరలోకానికి చేరునట్లు సిద్ధపరుస్తూ, నరకంలోని ఘోర శిక్షలను తప్పించుకోవచ్చు.

## సూచనలు

[1]*Gehenna* అనేది గ్రీకు రూపం. హెబ్రీలో వీలి అంటే "లోయ" మరియు *Hinnom*, లోయయొక్క సొంతగాడు అని అర్థమిచ్చే రెండు పదాలు. [2]మత్తయి 5:22, 29, 30; 10:28; 18:9; 23:15, 33; మార్కు 9:43, 45, 47; లూకా 12:5; యాకోబు 3:6 చూడు. [3]2 రాజులు 23:10; 2 దినవృ. 28:3; 33:6; యిర్మీయా 7:31, 32; 19:6 చూడు. [4]మార్కు 9:43; లూకా 3:17లను చూడు. [5]"పరిపూర్ణమైన" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం *telios* అంటే "mature" అని అర్థం.